క్లుప్తంగా

ఎస్సీ శ్మశాన వాటికలో వన మహోత్సవం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఎస్సీ శ్మశాన వాటికలో వినూత్న వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ మానికొండ శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్మశాన వాటికలో వివిధ రకాల మొక్కలను నాటారు. వారు మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా ట్రస్ట్ సభ్యులు చేపట్టాలన్నారు. మొక్కల సంరక్షణ జరిగినప్పుడే కాలుష్య నివారణ సాధ్యమవుతుందన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు గద్దపాటి ప్రసాద్, వినూత్న వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ



మునునూరు: రమణక్కపేట ఎస్సీ ఏరియాలో తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. ఇక్కడ మంచినీటి మోటారు మొరాయించడంతో తాగునీటి సమస్య తలెత్తింది. దీనిపై సర్పంచ్ రంగు ధనలక్ష్మి స్పందించి, అధికారులను అప్రమత్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో బోరుకు నూతన మోటారును ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు. మంచినీటి సరఫరాలో అంతరాయం తొలగి ప్రజలకు సక్రమంగా మంచినీరు అందుతుందని ఎంపీడీఓ బీఏ సత్యనారాయణ చెప్పారు.

వర్షాలు కురవాలని జలాభిషేకం



ఆగిరిపల్లి: వర్షాలు కురిసి సకాలంలో పంటలు పండాలని ఆగిరిపల్లిలో ఆదివారం గ్రామ దేవతలకు మహిళలు జలాభిషేకం చేశారు. మహిళలు నీళ్ల బిందెలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి కనకదుర్గమ్మ, గంగానమ్మ తల్లికి నీటితో అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్టీసీ జైభీమ్ సంఘం కమిటీ ఎన్నిక



తిరువూరు: ఆర్టీసీ జైభీమ్ యూనియన్ తిరువూరు డిపో నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బి. ప్రసాద్, అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బద్దెయ్య, జేఎస్ఎస్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామారావు, కార్యదర్శిగా గద్దల ఏసుపాదం, సహాయ కార్యదర్శిగా బంకా లాబాను, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి. జానకి, కోశాధికారిగా జేటీ రావు ఎన్నికయ్యారు.

నలుగురు జూదరుల అరెస్ట్

చాట్రాయి: మండలంలోని సి గుడిపాడు శివారులో పేకాట శిబిరంపై దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ రామకృష్ణ ఆదివారం తెలిపారు. నిందితుల నుంచి రూ. 6,200 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతో పాటు ఆషాఢమాసం, పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. అమ్మవారు మల్లెపూల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూ లైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

ప్రతిపాదనలతోనే సరి!

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరైన పథకాలే దిక్కు
- అమలుకాని ఎన్నికల హామీలు
- నిధులు వస్తాయంటూ ఊరిస్తున్న ఎమ్మెల్యే

తిరువూరు: తాము గెలిచిన నెల రోజుల్లో అభివృద్ధి పనులకు నిధులు సాధిస్తామని ఎన్నికల సమయంలో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఇచ్చిన హామీలు ఇంతవరకు అడుగు ముందుకు పడలేదు. ప్రాధాన్యతా క్రమంలో రహదారులు, తాగునీటి ప్రాజెక్టులు మంజూరు చేస్తామని చెప్పిన ఎమ్మెల్యే ఇంతవరకు రూపాయి కూడా నిధులు సాధించలేకపోయారని తిరువూరు నియోజకవర్గ ప్రజలు విమర్శిస్తున్నారు.



గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరుపై శిథిలమైన వంతెన

ఎన్నికల్లో ఎమ్మెల్యే ఇచ్చిన హామీలలో కొన్ని..

- గంపలగూడెం మండలం వినగడపలో కట్టలేరుపై వరదలకు కొట్టుకుపోయిన వంతెన స్థానంలో రూ.30 కోట్లతో హై లెవెల్ వంతెన నిర్మిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఎమ్మెల్యే ప్రకటించారు. ఎన్నికల ఫలితాలొచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పినా ఇంతవరకు వంతెన పనులకు మోక్షం లభించలేదని గంపలగూడెం మండల ప్రజలు వాపోతున్నారు. 20 గ్రామాల ప్రజలకు మండల కేంద్రంతో వర్షాకాలంలో సంబంధాలు తెగిపోయి ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ వంతెన మంజూరైనప్పటికీ ఎన్నికల నియమావళి అమలుతో అప్పట్లో టెండర్ల ప్రక్రియ నిలిచిపోయింది.
- ఎ.కొండూరు మండలంలోని కిడ్నీ వ్యాధి పీడిత గ్రామాల్లో కృష్ణా నదీ జలాలను తాగునీటి అవసరాల నిమిత్తం సరఫరా చేసే పైలట్ ప్రాజెక్టు పనులు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే చాలావరకు పూర్తికాగా, ఏడాది కాలంగా మిగిలిన పనులను పూర్తి చేయడం లేదు. ఎప్పటికప్పుడు త్వరలో పనులు పూర్తిచేస్తామని అధికార యంత్రాంగం చెబుతున్నా, తాగునీటి సరఫరా ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పలేకపోతున్నారు.
- తిరువూరు పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ శాశ్వత పరిష్కారం లభించడం లేదు. గత ప్రభుత్వంలో రూ.160 కోట్లతో కృష్ణా నదీ జలాలు సరఫరా చేసే పైలట్ ప్రాజెక్టు మంజూరు కాగా, ఇది నగర పంచాయతీకి ఆర్థిక భారంగా మారుతుందనే కారణంతో ఎమ్మెల్యే పక్కన పెట్టారు. పలు మార్లు అధికారులతో ఎమ్మెల్యే సమీక్షలు జరుపుతున్నా ఫలితం ఉండడం లేదని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు.



చిత్తశుద్ధి లేదు

తిరువూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ఇంత వరకు ఒక్క రూపాయి నిధులు కూడా సాధించలేదు. తాగునీరు, సాగునీరు లేక తిరువూరు నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరు వంతెన నిర్మాణం వెంటనే పూర్తిచేయాలి.

– నల్లగట్ల స్వామిదాసు, వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి



తాగునీరందించాలి

తిరువూరు పట్టణానికి శాశ్వత తాగునీటి పథకం లేక నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు పట్టించుకోవడం లేదు. కృష్ణా నదీ జలాలు వస్తాయని ఆశ చూపిస్తూ ఎన్నికల్లో పబ్బం గడుపుకుంటున్న ప్రజాప్రతినిధులు ఇకనైనా చిత్తశుద్ధితో పనులు చేపట్టాలి.

– పరసా నెహ్రూ, తిరువూరు



వంతెన నిర్మించాలి

గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరుపై వంతెన నిర్మాణం వెంటనే చేపట్టాలి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే నిధులు మంజూరైనా కూటమి ప్రభుత్వం టెండర్లు పిలిచి పనులు చేపట్టకపోవడం శోచనీయం. ప్రజల ఇబ్బందులు ఇకనైనా గుర్తించాలి.

– కోట దాసు, మాజీ ఎంపీపీ, గంపలగూడెం

కార్మికుల సమ్మెతో అంధకారంలో తిరువూరు

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేపట్టడంతో పట్టణంలో ఆదివారం అంధకారం అలుముకుంది. వీధి దీపాల ఆపరేటర్లు కూడా ఈ సమ్మెలో పాల్గొనగా, నగర పంచాయతీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో వీధులు చీకటిమయమయ్యాయి. పబ్లిక్, ప్రైవేటు కుళాయిల ద్వారా రక్షిత మంచినీటి సరఫరా కూడా నిలిచిపోయింది. కార్మికుల సమ్మె ముగిసేవరకు తాత్కాలిక సిబ్బందిని నియమించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ముమ్మరంగా వరినాట్లు



మునునూరు: అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతులు వరి నాట్లు ప్రారంభించారు. మండలంలో ఆరు వేల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా ప్రస్తుతానికి వెయ్యి ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయాధికారి ఆలూరి చాముండేశ్వరి తెలిపారు. మరో మూడు వేల ఎకరాలకు సరిపడా నారు సిద్ధమవుతోందని, వారం లోగా 50 శాతానికి పైగా వరి నాట్లు పూర్తవుతాయని చెప్పారు. మిగిలిన ప్రాంతాల్లో ఆగస్టు తొలి వారం నాటికి నాట్లు పూర్తి కావచ్చన్నారు. బోర్లు, మోటార్ల ఆధారంగా ఉన్న గుళ్ళపూడి, గుడిపాడు, సూరేపల్లి, చెక్కపల్లి గ్రామాల్లో 40 శాతం వరి నాట్లు పూర్తి కాగా, లోపూడి, బలివే, యల్లాపురం గ్రామాల్లో 20 శాతం వరకు నాట్లు పూర్తయ్యాయని వివరించారు.

జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై దాడి సిగ్గుమాలిన చర్య

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కిరణ్ కుమార్ రెడ్డి

మైలవరం: రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందనడానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై దాడి నిదర్శనంగా నిలుస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి మండి పడ్డారు. మైలవరంలో ఆదివారం జరిగిన సమావేశంలో హారికపై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడుతూ రక్షణ కల్పించాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం చూస్తే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోందన్నారు. ఎన్ని దాడులు చేసినా, ఎన్ని కేసులు పెట్టినా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకుల మనోస్థైర్యాన్ని ఒక్క అంగుళం కూడా తగ్గించలేరని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికకు క్షమాపణ చెప్పి నిందితులపై చట్టపరమైన చర్యలకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. నాయకులు పాల్గొన్నారు.

దాడి హేయం..

మైలవరం: జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ గూండాలు దాడి చేయడం హేయమైన చర్య అని మైలవరం నియోజకవర్గం రెడ్డిగూడెం మండల జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి అన్నారు. పెడన మండలం కూడూరు గ్రామంలో పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము, కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికలను వారి నివాసంలో పాలంకి విజయభాస్కరరెడ్డి ఆదివారం కలిసి పరామర్శించారు. దాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావును ఉమ్మడి జిల్లాల జెడ్పీటీసీ సభ్యులతో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడికి పాల్పడిన వారిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.



మాట్లాడుతున్న అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి

కొండపోరంబోకు స్థలాల రెగ్యులరైజేషన్‌కు అవకాశం

విజయవాడరూరల్: ప్రభుత్వ కొండపోరంబోకు స్థలాలను ఆక్రమించుకొని నివాసం ఉంటున్న కుటుంబాలకు ప్రభుత్వం రెగ్యులరైజేషన్‌కు జీఓ 30 ద్వారా అవకాశం కల్పించిందని విజయవాడ రూరల్ తహసీల్దారు బి.సుగుణ ఒక ప్రకటనలో తెలిపారు. కొండపోరంబోకు స్థలాల్లో నివాసం ఉంటున్న వారు రెగ్యులరైజేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. ప్రస్తుతం మండలంలోని షాబాదు గ్రామంలోని కుటుంబాలు కొండపోరంబోకు స్థలాల్లో నివాసం ఉంటున్నట్లుగా ప్రభుత్వం గుర్తించిందని, ఆ గృహాలను ఇంటింటికి వెళ్లి వీర్వోలు బృందాలు విచారణ చేస్తున్నారని చెప్పారు. ప్రాథమిక సమాచారం మేరకు 225 కుటుంబాలు నివసిస్తున్నాయని, వాటికి సంబంధించిన వివరాలతో ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. ఇంకా మండలంలో అర్హులైన వారు ఎవరైనా ఉంటే రెగ్యులరైజేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.



షాబాదు గ్రామంలో విచారణ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

95 మందికి వైద్య పరీక్షలు

కవులూరు(జి.కొండూరు): జి.కొండూరు మండలం కవులూరు గ్రామంలో ధన్వంతరీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. ప్రతి నెలా రెండో ఆదివారం జరిగే వైద్య శిబిరంలో డాక్టర్లు వాణి, ఈశ్వర్, పవన్ 95మంది రోగులకు వైద్య పరీక్షలు జరిపారు. ప్రతి నెలా జరిగే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అవసరమైన వారికి 30 రోజులకు సరిపడా మందులు ఉచితంగా అందజేశారు. గ్రామ పెద్దలు హనుమంతరావు, రామారావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీడీఓ బి.భార్గవి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండవ ఫౌండేషన్, రమేష్ హాస్పటల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ భార్గవి ప్రారంభించారు. 230 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మండవ ఫౌండేషన్ ఫౌండర్స్ మండల వెంకటరామయ్య, రమాదేవి, ఆగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జాస్తి జగన్ మోహన్‌రావు పాల్గొన్నారు.



కవులూరులో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యలపై అర్జీలను స్వీకరించి గడువులోగా పరిష్కారాన్ని చూపుతామన్నారు.

- మునునూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని తహసీల్దార్ కేవీ రమణ చెప్పారు. మండల స్థాయి అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కారం పొందవచ్చన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

విస్సన్నపేట: స్థానిక కేఎమ్మార్ అండ్ ఎమ్మెస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న జువాలజీ అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ జి. నరసింహారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్సీ జంతు శాస్త్రంలో కనీసం 50 శాతం మార్కులు పొందిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 17న సాయంత్రం ఐదు గంటల లోగా కళాశాల కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. ఈనెల 18న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

కరెడ్ల దంపతులకు సన్మానం

మైలవరం: మైలవరం సొసైటీ అధ్యక్షుడిగా నియమితులైన కరెడ్ల వెంకట నారాయణ దంపతులను, మైలవరం మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులైన పోనకాల నవ్యశ్రీ బ్రహ్మయ్య దంపతులను, మైలవరం గ్రామానికి చెందిన డాక్టర్ గరికపాటి హరిప్రసాద్‌కు ప్రతిష్ఠాత్మకమైన ఎన్టీఆర్ అవార్డు లభించినందుకు డాక్టర్ హరిప్రసాద్ దంపతులను మైలవరం కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. మైలవరంలోని ఎన్‌డీపీ బ్రదర్స్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కాపు సంఘం మైలవరం మండల అధ్యక్షులు కరెడ్ల సీతయ్య మాట్లాడుతూ సంఘం సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. కాపు సంఘం ఉపాధ్యక్షుడు ధరణికోట శ్రీనివాసరావు, సెక్రటరీ ముత్యాల రత్తయ్య, నాగులూరి ఆజాద్, దుర్గాప్రసాద్, సాగ వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కరెడ్ల సాంబశివరావు, ఎన్. పోనకాల రావు, డి. మస్తాన్‌రావు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొండపల్లి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఆదివారం నిరవధిక సమ్మెకు దిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని నాయకులు విమర్శించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ జీఓ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఇప్పటివరకు శాంతియుతంగా నిరసన తెలిపారని, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. వీరికి మద్దతుగా పారిశుద్ధ్య కార్మికులు సైతం త్వరలో సమ్మెకు దిగుతారని హెచ్చరించారు. వర్కర్స్ యూనియన్ నాయకుడు వాసు, శ్రీను, వెంకయ్య, రవి, నరేష్, జోజి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

తిరువూరు: తమ సమస్యల పరిష్కారం కోరుతూ తిరువూరు నగర పంచాయతీ ఇంజినీరింగ్ కార్మికులు శనివారం అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఆదివారం ధర్నా చేశారు. నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని, 62 ఏళ్లకు పదవీ విరమణ కల్పించాలని, పదవీ విరమణ ప్రయోజనాలు ఇవ్వాలని, జీఓ నం.36 ప్రకారం వేతనాలివ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని కోరుతూ సమ్మె చేస్తున్నామని సీఐటీయూ నాయకులు బి. వెంకటేశ్వరరావు, ఆకుల రవి, ఇంజినీరింగ్ కార్మిక యూనియన్ ఉపాధ్యక్షుడు వాసు, కోశాధికారి రఫీ, సభ్యులు తెలిపారు.



కొండపల్లిలో సమ్మె చేస్తున్న కార్మికులు, నాయకులు



తిరువూరులో ధర్నా చేస్తున్న నగర పంచాయతీ కార్మికులు

గంగానమ్మకు ఆషాఢ సారె సమర్పణ



ఊటుకూరు రామాలయంలో సారె సమర్పించేందుకు వచ్చిన భక్తులు

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని కిలేశపురం గ్రామంలో కొలువై ఉన్న గంగానమ్మ అమ్మవారికి పలువురు భక్తులు ఆదివారం ఆషాఢ సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. తొలుత గ్రామంలోని బొడ్డురాయికి నీళ్ల వారబోసి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. అనంతరం భక్తులు పసుపు, కుంకుమ, గాజులు, పట్టుచీరలు, పూలు, పండ్లు, వివిధ రకాల పిండి వంటలు, పొంగళ్లతో అమ్మవారి నామస్మరణ చేస్తూ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

- చాట్రాయి: ఆషాఢ మాసం సందర్భంగా మండలంలోని చాట్రాయి కనకదుర్గ అమ్మవారికి మహిళలు ఆదివారం సారె సమర్పించారు. పసుపు కుంకుమ, గాజులు చీరను తలపై పెట్టుకుని మంగళ వాయిద్యాలతో అమ్మవారికి సమర్పించారు.
- తిరువూరు: గంపలగూడెం మండలం ఊటుకూరు కోదండ రామాలయంలో ఆదివారం సీతాదేవి, రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లకు మహిళలు సారె సమర్పించారు. గ్రామంలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం నుంచి పసుపు కుంకుమ, గాజులు, పండ్లు, పూలు, చీరె, జాకెట్, చలిమిడిని సారెగా తీసుకుని ఆలయానికి వెళ్లి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి సారె సమర్పించారు.
- లోపూడి (మునునూరు): లోపూడి శివారు బాసవరప్పాడులోని గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లికి భక్తులు సారె సమర్పించారు. సమరసత ఫౌండేషన్ నూజివీడు ఏరియా ధర్మ ప్రచారక్ పి. పరమేశ్వరరావు ఆధ్వర్యంలో లోపూడి శివారు బాసవరప్పాడుకు చెందిన 20 మంది మహిళా భక్తులు ఆదివారం తిరుపతమ్మ అమ్మవారికి చీర, సారె, పసుపు కుంకుమలు సమర్పించి పూజలు నిర్వహించారు.



గంగానమ్మకు సమర్పించిన ఆషాఢం సారె



చాట్రాయిలో అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

- తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. కోదాడ పట్టణానికి చెందిన నండూరి వేద మనోజ్ఞ దంపతులు రూ.25,116, నిడుమోలుకు చెందిన ఎండూరి లిఖిత రమ్య దంపతులు రూ. 14,116లను ఈఓ సాంబశివరావుకు అందజేశారు. ఆలయ అర్చకులు రామకృష్ణమాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు కష్టకాలం

- కరుణించని వరుణుడు
- సాగునీరు అందక నెర్రెలిస్తున్న పొలాలు

చాట్రాయి: సాగునీరు అందక నాట్లు వేసిన వరి పొలాలు నెర్రెలిస్తున్నాయి. ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాలకు రైతులు ఖరీఫ్ వరి నాట్లు వేశారు. గత వారం రోజులుగా వర్షం జాడ లేకపోవడం, ఎండలు మండుతుండటంతో ఉన్న కాస్త నీరు భూమిలో ఇంకిపోయి పొలాలు బీడు వారుతున్నాయి. పొలాలను చూసిన రైతులు వేల రూపాయలు వరినాట్లకు ఖర్చు పెట్టామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసిన వరి పైరును కాపాడుకునేందుకు బోర్ల నుంచి వచ్చే నీరు ఒక్క ఎకరానికి సరిపోతుందని, మిగతా పంటకు పెట్టేలోగా నీరు పెట్టిన పొలాలు మళ్లీ నీటి కోసం ఎదురు చూస్తున్నాయని రైతులు వాపోతున్నారు. మండిపోతున్న ఎండలకు బోర్లలో నీటి మట్టం తగ్గిపోతోందని, అంగుళంన్నర వచ్చే బోరు అంగుళం నీరు కూడా రావడంలేదని అన్నదాతలు చెబుతున్నారు. మెట్ట పైర్లు పత్తి, మొక్కజొన్న, పెసర కూడా ఎండిపోయే పరిస్థితి ఉంది.

ఎండిపోతున్న చెరువులు

మండలంలో సుమారు 119 చెరువులు ఉండగా దాదాపు 90 చెరువుల్లో చుక్కనీరు లేని పరిస్థితి నెలకొంది. మండలంలో 10 వేల ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా ఈ నెలలో సరైన వర్షపాతం నమోదు కాకపోవడంతో రెండు వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. మెట్ట మండలం కావడంతో వర్షాధారంపై ఆధారపడి వరిసాగు చేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు. తెలంగాణలో వర్షాలు కురిస్తే ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలో బేతుపల్లి చెరువుల అలుగు ద్వారా మండలంలోని తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకి, సీకే పాడు ఛానల్‌కి వరద నీరు వచ్చేది. అక్కడ కూడా వర్షాలు కురవకపోవడంతో తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టులో నీరు లేక వెలవెలబోతోంది. దీంతో ఖరీఫ్ సాగుకి కష్టకాలం వచ్చినట్లుగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



చనుబండలో నెర్రెలిచ్చిన వరి పొలం